సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 3 । మార్చి । 2025



అడవిలో ఆధ్యాత్మిక శోభ

మన్యంలో కొలువుదీరిన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయం వద్ద ఈనెల 14 నుంచి మూడు రోజులపాటు జాతర నిర్వహించనున్నారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ సా॥)	సహారీ (మం॥ ఉ॥)
భీమవరం	6.16	5.00
నరసాపురం	6.17	4.58
తాడేపల్లిగూడెం	6.12	5.08




పెళ్లికి వెళ్లి వస్తుండగా..

పెళ్లికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. దెందులూరు మండలంలో సంఘటన జరిగింది. 8లో

న్యూస్‌రీల్

ట్రెజరీ సంఘ ఎన్నికలు ఏకగ్రీవం



జిల్లా సంఘానికి ఎన్నికైన కార్యవర్గం

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం ట్రెజరీ కార్యాలయంలో ఆదివారం ట్రెజరీస్, అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా జె.రామారావు, ఎం.సత్యనారాయణ, సహాధ్యక్షుడిగా కేఎంకే హనుమంతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వీఎస్ఎస్ శ్రీనివాస్, ఎన్.సీతారామయ్య, డి.పుష్పలత, ఎం.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.నరేంద్రరాజు, జాయింట్ సెక్రటరీలుగా డి.నాగభూషణం, జె.తిరుపతిరెడ్డి, వి.శారద దేవి, ట్రెజరర్‌గా పి.కొండలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి షేక్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. సంఘం సభ్యుల పురోభివృద్ధికి పాటుపడుతూ త్వరలోనే అన్ని జిల్లాల ఎన్నికలు పూర్తిచేసుకుని రాష్ట్ర సంఘ ఎన్నికలకు వెళతామని నాయకులు తెలిపారు.


మత్స్యకారుల సమస్యలపై మంత్రికి వినతి



సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన మత్స్యకార నాయకులు

భీమవరం(ప్రకాశంచౌక్) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మత్స్యకారుల సంక్షేమంతో పాటు మత్స్యరంగ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆదేశించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కేంద్ర మంత్రిని నూతనంగా ఎన్నికైన ఉమ్మడి జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు మైల వసంత రావు, పాలకవర్గ సభ్యులు కలిశారు. జిల్లాలో మత్స్యకారుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెరైన్ ప్రాంతంలోని ఫిష్ మార్కెట్లలో వసతుల కల్పన, పంచాయతీరాజ్ చెరువుల వేలంలో 10 శాతం పరిమితి దాటకుండా చర్యలు తీసుకోవాలని, వలలు, నావలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని 75 శాతం పెంచాలని, మత్స్యకార కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, మత్స్యకారుల వాహనాలకు ఇచ్చే రాయితీలు పెంచాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సంఘ వైస్ ప్రెసిడెంట్ రాజా బాలాజీ, డైరెక్టర్లు వూడిమూడి శ్రీనివాస్, బేరం శ్రీరామచంద్రమూర్తి, బెజవాడ నాగరాజు, తిరుమాణి సీతామాలక్ష్మి, మోకా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'హోమియో'పై అవగాహన



ఐఐహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు శివమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హోమియో వైద్య విధానంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు దేశవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించేందుకు నిర్ణయించామని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పీ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎస్ శివమూర్తి తెలిపారు. గత నెల 22,23 తేదీల్లో పూణేలో జరిగిన జాతీయ హోమియో వైద్యుల సదస్సులో ఏలూరుకు చెందిన డాక్టర్ శివమూర్తిని ఐఐహెచ్‌పీ జాతీయ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నగరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పదవీ కాలం 2027 వరకు ఉంటుందని, హోమియో పట్టభద్రుల విజ్ఞాన సముపార్జన కోసం వైద్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ హోమియో వైద్యుల నియామకాలు, హోమియో వైద్య కళాశాలల్లో బోధనా సిబ్బందిని పెంచడం కోసం కృషి చేస్తామన్నారు. హోమియో వైద్యంలో ఎండీ కోర్సులు, నూతన సబ్జెక్టుల ప్రారంభం, సూపర్ స్పెషాలిటీ కోర్సుల కోసం కృషి చేస్తామన్నారు. హోమియో మందుల ప్రామాణికతను పెంచడానికి, సమాజంలో వివిధ వైరస్‌ల నివారణకు ఉచిత వ్యాధి నిరోధక శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అనంతరం హోమియో వైద్య నిపుణులు ఆయన్ను సత్కరించారు. ఐఐహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు వీకే పంకజాక్షన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.గోపీనాథ్, జిల్లా అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్గి.. రాజుకుంటే బుగ్గే!

సాక్షి, భీమవరం: ఈ ఏడాది వేసవిలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఇప్పటికే వాతావరణశాఖ ప్రకటించింది. అందుకు తగ్గట్టు అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలతో సూర్యుడు నిప్పులు చెరుగుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాడు. మిగిలిన రోజులతో పోలిస్తే వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయి. గత వారం రోజుల్లో జిల్లావ్యాప్తంగా పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధిక శాతం గ్యాస్ లీకేజీ, విద్యుత్ వినియోగం పెరిగి షార్ట్ సర్క్యూట్ ఏర్పడటం, ఓల్టేజీలో హెచ్చుతగ్గులు, ఓవర్‌లోడ్ కారణంగా సింగిల్ ఫేజ్, త్రీఫేజ్ లైన్లు తరచూ ట్రిప్‌అయ్యి ఇళ్లల్లో ప్రమాదాలు సంభవిస్తుంటే, వరి కోతలు అనంతరం పొలాల్లోని గడ్డికి నిప్పు పెట్టడం, చుట్టా, సిగరెట్లను ఆర్పకుండా నిర్లక్ష్యంగా పారేయడం తదితర కారణాలు బహిరంగ ప్రదేశాల్లో ప్రమాదాలకు హేతువులవుతున్నాయి.

ఆలస్యంగా వాహనం.. రూ.10 లక్షల నష్టం

వీరవాసరం మండలం రాయకుదురులోని రెండు పోర్షన్ల తాటాకింటిలో రెండు కుటుంబాలు నివసిస్తున్నాయి. శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటికి నిప్పంటుకుంది. వెంటనే స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా పాలకొల్లుకు చెందిన ఫైర్ ఇంజన్ వచ్చింది. అప్పటికే తాటాకిల్లు పూర్తిగా దగ్ధమై ఇంటిలోని నగదు, వస్తువులు, దుస్తులు అన్నీ అగ్నికి ఆహుతైపోయాయి. చుట్టుపక్కల వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల నష్టం వాటిల్లింది. ఫైర్ ఇంజన్ కొంత ముందుగా వచ్చి ఉంటే నష్టం తీవ్రత తగ్గి ఉండేదని స్థానికులు అంటున్నారు.

డేంజర్ బెల్స్

- మార్చిలోనే మండుతున్న ఎండలు
- అగ్నిమాపక కేంద్రాల్లో సమస్యల మంటలు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఫైర్‌మెన్ పోస్టులు 35, డ్రైవర్ పోస్టులు 9 ఖాళీ
- పోస్టుల భర్తీకి చొరవ చూపని కూటమి సర్కారు
- జిల్లాలో 428 అగ్నిప్రమాదాల్లో రూ.4.35 కోట్ల నష్టం

అగ్నిమాపకం.. సమస్యలు అనేకం

జిల్లాలో ఏడు ఫైర్‌స్టేషన్లకు గాను జనావాసాలు ఎక్కువగా ఉన్న భీమవరం, పాలకొల్లులో డబుల్ యూనిట్ ఫైర్‌స్టేషన్లు ఉన్నాయి. మిగిలిన ఫైర్ స్టేషన్ల సిబ్బందితో పోలిస్తే రెట్టింపు ఉండేలా గతంలో వీటిని ఏర్పాటుచేశారు. భీమవరం, నరసాపురం ఫైర్ స్టేషన్లు శిథిలస్థితికి చేరుకున్నాయి. భీమవరం ఫైర్ స్టేషన్‌ను షెడ్డులో నిర్వహిస్తున్నారు. భీమవరంలో రూ.2 కోట్లు, నరసాపురంలో రూ.1.25 కోట్లతో నూతన భవన నిర్మాణాలకు పరిపాలన ఆమోదం లభించగా టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది.

సిబ్బందిపై పనిభారం

ఫైర్‌స్టేషన్లకు సిబ్బంది కొరత సమస్యాత్మకంగా తయారైంది. ఏడు స్టేషన్ల పరిధిలో మంజూరైన పోస్టుల మేరకు అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు ఇద్దరు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు ఐదుగురు, లీడ్ ఫైర్‌మెన్లు 27 మంది, డ్రైవర్లు 25 మంది, ఫైర్‌మెన్లు 83 మంది, హోంగార్డులు 24 మంది కలిపి మొత్తంగా 166 మంది ఉండాలి. కాగా 117 మంది మాత్రమే ఉన్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నుంచి పైస్థాయి వరకు కొరత లేనప్పటికీ ప్రమాద సమయంలో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేసే ఫైర్‌మెన్, డ్రైవర్, హోంగార్డ్ పోస్టులు ఖాళీలు ఉండటం సమస్యాత్మకంగా తయారైంది. 49 ఖాళీ పోస్టుల్లో ఫైర్‌మెన్లు 35, డ్రైవర్లు తొమ్మిది, హోంగార్డులు ఐదు ఉన్నాయి. దీంతో ఉన్న కొద్దిమంది సిబ్బందిపై విపరీతమైన పనిభారం పడుతోంది.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

సకాలంలో చేరలేక.. మంటలు ఆర్పలేక..

భీమవరం, పాలకొల్లు ఫైర్‌స్టేషన్ల పరిధిలో చుట్టుపక్కల ఐదారు మండలాలు ఉండగా నరసాపురం పరిధిలో తీరప్రాంత గ్రామాలు ఉన్నాయి. పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు కిందకి ఉండటం, రోడ్ల పక్కన ఆక్రమణలు, ట్రాఫిక్ రద్దీ ఫైర్ ఇంజన్లు మారుమూల ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రతిబంధకమవుతున్నాయి. 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం సంభవించినప్పుడు ఫైర్ ఇంజన్ వచ్చేసరికి సర్వం బూడిదైపోతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25)లో జిల్లాలో 428 అగ్నిప్రమాదాల్లో రూ.4.35 కోట్ల నష్టం వాటిల్లింది.

అప్రమత్తంతో ప్రమాదాల నివారణ



వేసవి దృష్ట్యా ఇప్పటికే జిల్లాలోని అన్ని ఫైర్ ఇంజన్లను సిద్ధం చేసి ఉంచాం. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా అగ్నిప్రమాదాలను నివారించవచ్చు. ప్రమాదాలను అరికట్టడంపై అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. ఖాళీ పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు నివేదించాం. భీమవరం, నరసాపురంలో నూతన భవన నిర్మాణాలకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ వచ్చింది. ఆచంటలో కొత్త ఫైర్‌స్టేషన్ ఏర్పాటు నిమిత్తం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– జి.శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

జిల్లాలో అగ్నిప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	ఆస్తి నష్టం (రూ.కోట్లలో)	రక్షించిన ఆస్తి విలువ (రూ.కోట్లలో)
2022–23	417	10.56	34.39
2023–24	449	4.98	12.67
2024–25	428	4.35	20.19

ప్రమాదాల్లో ప్రాణనష్టం

సంవత్సరం	ప్రాణనష్టం	కాపాడిన వారి సంఖ్య
2022–23	6	10
2023–24	2	1
2024–25	1	1

జిల్లాలో ఫైర్ స్టేషన్లు

ప్రాంతం	ఫోన్ నంబర్
భీమవరం	08816-233299
పాలకొల్లు	08814-222299
తణుకు	08819-222101
తాడేపల్లిగూడెం	08818-221299
నరసాపురం	08814-275399
ఆకివీడు	08816-252099
అత్తిలి	08819-257977

నిజాయతీతో సేవలందించాలి





నియామకం పొందిన ఎస్సైలు, మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్ (ఇన్‌సెట్‌లో)

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్
- 100 మంది ఎస్సైలకు నియామక పత్రాలు అందజేత

ఏలూరు టౌన్: సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు నిర్భయంగా, నిష్పక్షపాతంగా, నిజాయతీతో సేవలందించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో శిక్షణ పూర్తిచేసుకున్న ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఆదివారం ఏలూరు రేంజ్ కార్యాలయంలో ఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రొబేషనరీ ఎస్సైలకు ఆయన నియామక ఉత్తర్వులు అందజేశారు. రేంజ్ పరిధిలో 100 మంది (68 మంది పురుషులు, 32 మంది మహిళలు) ఎస్సై శిక్షణ పూర్తిచేసుకోగా జిల్లాల వారీగా ఏలూరు 1, అల్లూరి సీతారామరాజు 4, కాకినాడ జిల్లా 2, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 1, తూర్పుగోదావరి జిల్లా 15, పశ్చిమగోదావరి జిల్లా 1, కృష్ణా జిల్లా 20, ఎన్టీఆర్ జిల్లా 56 మంది ఉన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా అత్యుత్తమ సేవలు అందించాలన్నారు. బాధితుల పక్షాన న్యాయం చేయటం, నిందితులకు చట్టాల మేరకు శిక్షలు విధించేలా పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. నేరస్తులకు భయం, బాధితులకు అభయం అందించేలా పనిచేయాలన్నారు. పోలీస్ విధుల్లో పనిచేయటం అదృష్టంగా భావిస్తూ చట్టాలకు లోబడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఐజీ పిలుపునిచ్చారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- నేడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- 28 టేబుళ్లు.. 17 రౌండ్లు
- 2,18,902 ఓట్ల లెక్కింపు
- ఉదయం 8 గంటలకు ప్రారంభం

ఏలూరు(మెట్రో) : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. ఏలూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు సోమవారం ప్రారంభం కానుంది. ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆధ్వర్యంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని ఆరు జిల్లాల్లో 456 పోలింగ్ కేంద్రాల్లో గతనెల 27న పోలింగ్ జరిగింది.

69.50 శాతం పోలింగ్

అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3,637, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 47,125, ఏలూరు జిల్లాలో 29,651, కాకినాడ జిల్లాలో 47,150, తూర్పుగోదావరి జిల్లాలో 42,446, పశ్చిమగోదావరి జిల్లాలో 48,893 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 69.50 శాతం ఓటింగ్ నమోదు కాగా బ్యాలెట్ బాక్సులను ఏలూరులోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

బరిలో 35 మంది..

ఎన్నికల బరిలో 35 మంది నిలిచారు. కౌంటింగ్ కేంద్రానికి సిబ్బంది ఉదయం 6.30 గంటలలోపు చేరుకోవాలని ఆదేశాలు జారీ చేయగా.. కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటలకు ప్రారంభం కానుంది. మూడు షిఫ్టుల్లో 700 మంది సిబ్బంది పాల్గొంటారు. 28 టేబుళ్లను ఏర్పాటుచేయగా 17 రౌండ్లలో కౌంటింగ్ జరుగనుంది. ప్రతి టేబుల్‌కూ కౌంటింగ్ సిబ్బంది, సూపర్‌వైజర్, రోల్ ఇన్‌చార్జి, షిఫ్ట్ ఇన్‌చార్జి, మైక్రో అబ్జర్వర్లు విధులు నిర్వహిస్తారు. తెలుగుదేశం బలపర్చిన అభ్యర్థి, పీడీఎఫ్ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ నెలకొంది.



కౌంటింగ్‌కు సిద్ధం చేసిన టేబుళ్లు

సిబ్బందికి సమగ్ర శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కౌంటింగ్ ఏర్పాట్లను ఆదివారం ఆమె పరిశీలించారు. కౌంటింగ్‌పై సిబ్బందికి సమగ్ర శిక్షణ ఇచ్చామన్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, లెక్కింపు పూర్తికావడానికి రెండు, మూడు రోజుల సమయం పట్టవచ్చన్నారు. పూర్తి భద్రతా ఏర్పాట్ల మధ్య కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి డ్యూటీ పాసులు, ఏజెంట్లకు ఐడీ కార్డులు జారీ చేశామన్నారు. పాస్ లేనిదే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. సెల్‌ఫోన్‌లు నిషేధమన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద నిర్వహిస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజును కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జేసీ పి.ధాత్రిరెడ్డి, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు తదితరులు ఉన్నారు.



ఏలూరులో కౌంటింగ్ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

భూకంపం.. అప్రమత్తం చేద్దాం

- 19 ఏళ్లుగా భూకంపాలను పసిగట్టే పరిశోధనలు
- వారం నుంచి నెల రోజులు ముందుగా గుర్తించేలా ప్రయోగాలు
- తుది దశకు చేరిన అంకం
- ఆరేళ్లుగా వెబ్‌సైట్‌లో భూకంపాల డేటా
- ఏలూరుకు చెందిన ఇంజనీర్ శివ సీతారామ్ సరికొత్త ఆవిష్కరణ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: భూకంపాలపై దశాబ్దాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. అయితే భూకంపం ఎలా వస్తుంది.. ఎప్పుడు వస్తుంది.. ఎందుకు వస్తుంది.. ఎంత తీవ్రతతో వస్తుంది.. అన్న ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు లేవు. ఒక్కో దశను పూర్తి చేసుకుని ప్రస్తుతం ప్రపంచంలో అభివృద్ధి చెందిన అతి కొద్ది దేశాల్లో 30 నుంచి 40 సెకన్లు ముందుగా చెప్పే వ్యవస్థను మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. మన దేశంలో అయితే అటువంటి వ్యవస్థ కూడా లేదు. తుపాను ప్రభావిత ప్రాంతాలను వాతావరణ శాఖ ముందుగా గుర్తించి ఎలా సమాచారం అందిస్తుందో అదే తరహాలో భూకంపాలను ముందుగా అంచనా వేసే టెక్నాలజీపై ఏలూరు నగరానికి చెందిన ఇంజనీర్ చేసిన పరిశోధనలు తుది అంకానికి చేరుకున్నాయి.



2004 నుంచి శోధన

19 ఏళ్ల పరిశోధనలు పలు అవాంతరాలు, అవరోధాలను దాటుకుని ఆరేళ్లుగా భూకంపాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో కూడిన డేటాను ముందస్తుగా అంటే కనీసం వారం నుంచి నెల రోజుల ముందు గుర్తించే సరికొత్త టెక్నాలజీని సిద్ధం చేశారు ఏలూరుకు చెందిన మరడాని శివ సీతారామ్. అన్ని ప్రయోగ దశలూ పూర్తి చేసుకుని తుది దశ పరీక్షల్లో ఉన్నారు. ఆయన మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఏడున్నరేళ్ల పాటు జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ నెట్‌వర్కింగ్‌పై పనిచేశారు. ప్రస్తుతం భూకంపాల రీసెర్చ్‌ని హైదరాబాద్ కేంద్రంగా కొనసాగిస్తున్నారు. 2004 నుంచి భూకంపాలు, సునామీలను గుర్తించడం ఎలా అనేదానిపై పరిశోధన ప్రారంభించి సరికొత్త విధానాన్ని రూపొందించారు. దాదాపుగా ఆరేళ్ల నుంచి ట్విట్టర్, www.seismo.in వెబ్‌సైట్‌లో ఫిలిప్పీన్స్, తైవాన్, జపాన్, ఇథియోపియా, అఫ్ఘనిస్తాన్, నేపాల్, టిబెట్, ఇండియాలో భూకంపాలకు సంబంధించిన సమగ్ర డేటాను పొందుపరిచారు. 2004 నుంచి దాదాపుగా 300కు పైగా భూకంపాలకు సంబంధించి సమాచారాన్ని సేకరించి 2020 నుంచి మాత్రమే పూర్తి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

20 రకాల పద్ధతులతో..

ప్రపంచవ్యాప్తంగా 20 రకాల పద్ధతుల్లో భూకంపాలను అంచనాలు వేస్తున్నారు. టెక్నాలజీలో అభివృద్ధి చెందిన జపాన్, తైవాన్, మెక్సికో, అమెరికా, ఉమేనియా, ఫ్రాన్స్, ఇటలీ లాంటి దేశాలు భూమిలో అమర్చిన సెన్సార్ ద్వారా 30 నుంచి 40 సెకన్ల ముందు పసిగట్టే వ్యవస్థను అందుబాటులో పెట్టారు.

భూకంప కేంద్రం నుంచి మార్పులు గుర్తిస్తూ..

శివ సీతారామ్ పరిశోధనలు చేసిన ఫలితాన్ని తుది దశకు తీసుకువచ్చారు. సమయం, ప్రదేశం, తీవ్రతను వారం నుంచి నెల రోజుల పాటు ముందస్తుగా అంచనా వేయగలుగుతున్నారు. అలా ముందస్తు అంచనాలతో సిద్ధం చేసిన సమాచారాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. 7 మ్యాగ్నిట్యూడ్ కంటే ఎక్కువ తీవ్రత ఉండే భూకంపాలు రావడానికి ముందు సుమారు 3 నుంచి 6 నెలల పాటు భూమి లోపల పొరల్లో వివిధ రకాల సంకేతాలు అందుతుంటాయి. దాని ప్రభావం 300 కిలోమీటర్ల వరకు ఉంటుంది. దీనిని బట్టి ప్రదేశం, సమయం, తీవ్రత ఈ మూడు అంశాల్లో కచ్చితత్వాన్ని అంచనా వేయగలిగితేనే ఆస్తి, ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. దీనిపైనే శివ పరిశోధనలు చేసి సూక్ష్మస్థాయి మార్పులు భూకంప కేంద్రం నుంచి కొన్ని కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటాయని గుర్తించారు. వీటిని కొన్ని పద్ధతుల్లో నిర్విరామంగా పర్యవేక్షించి అంచనా వేస్తున్నారు. ఇలా 2025 జనవరిలో టిబెట్‌లో 7.1 మ్యాగ్నిట్యూడ్, 2024 జనవరిలో జపాన్‌లో 7.6 మ్యాగ్నిట్యూడ్, 2023 నవంబరులో నేపాల్‌లో 6.3 మ్యాగ్నిట్యూడ్ లాంటి భూకంపాల నమోదు డేటాతో పాటు సుమారు 20 చోట్ల జరిగిన నష్టం తీవ్రత పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టారు.

మన దేశంలో జోన్లుగా విభజించి..

భూమి లోపల పొరల్లో జరిగే మార్పుల కారణంగా భూకంపాలు వస్తుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి సగటున రిక్టర్ స్కేల్‌పై 7 మ్యాగ్నిట్యూడ్ కంటే ఎక్కువగా 6 నుంచి 18 వరకు భూకంపాలు వచ్చే అవకాశం ఉంది. మన దేశంలో భూకంపాలను జోన్లుగా విభజించారు. జోన్-2లో హైదరాబాద్, దక్కన్ ప్రాంతం ఉండగా ఇక్కడ సగటున 5 మ్యాగ్నిట్యూడ్ నమోదుకు అవకాశం ఉంది. జోన్-3లో కోస్టల్ ప్రాంతం, గోదావరి, తెలంగాణలో కొంత ప్రాంతం ఉండగా 6 మ్యాగ్నిట్యూడ్ వరకు నమోదుకు అవకాశముంది. జోన్-4లో ఢిల్లీ, హర్యానా ఉండగా 7 మ్యాగ్నిట్యూడ్ వరకు నమోదుకు అవకాశముంది. హిమాలయాలు, నార్త్ ఈస్ట్ రాష్ట్రాల్లోని గుజరాత్, ఉత్తరాఖండ్‌లో 7 నుంచి 9 మ్యాగ్నిట్యూడ్ వరకు నమోదవుతుంది. జోన్-5 పరిధిలో అండమాన్ నికోబార్ దీవులు ఉన్నాయి. ఇక్కడ అత్యధికంగా 9 మ్యాగ్నిట్యూడ్ వరకు నమోదయ్యే అవకాశం ఉంది.

50కి పైగా దేశాల డేటాతో..



నా వద్ద ఉన్న తక్కువ స్థాయి సామర్థ్యం గల పరికరాలతో అంచనాలను రూపొందిస్తున్నా. భవిష్యత్‌లో మరింత పరిధి పెంచుకోవటానికి ప్రయత్నించి, మెరుగ్గా అంచనా విధానాన్ని సిద్ధం చేస్తున్నా. దీంతో 50కి పైగా దేశాల భూకంపాల రీసెర్చ్ డేటాను పరిశీలించి ఆయా దేశాలకు సమాచారం పంపే అవకాశం ఉంటుంది. దీనిని కొన్నేళ్లలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఆవిష్కరిస్తాను. భారత వాతావరణ శాఖ 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ భూకంపాలను ముందుగా అంచనాలు వేసే వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. దానికనుగుణంగా నా ప్రాజెక్టు సాగుతుంది.

– మరడాని శివ సీతారామ్, ఇంజనీర్, ఏలూరు

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్



ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్‌పర్సన్ విజయ భారతికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ యాక్టింగ్ చైర్‌పర్సన్ విజయ భారతి సయాని ఆదివారం మధ్యాహ్నం సందర్శించారు. ఆమెకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఈఓ ఎస్‌వీ సత్యనారాయణ మూర్తి స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

రాట్నాలమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ వారు

పెదవేగి: రాట్నాలమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దేవస్థానానికి విచ్చేసి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ వారం పూజా టిక్కెట్లపై రూ.38,240, విరాళాలుగా రూ.20,100, లడ్డూ ప్రసాదంపై రూ.19,725, ఫొటోల అమ్మకంపై రూ.2,000, ఆలయ నిర్మాణానికి రూ1,00,000 వచ్చిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉండి: ఉండి గోరింతోట వద్ద పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపిన వివరాల ప్రకారం మృతుడి ఒంటిపై లేత పసుపు రంగు టీషర్టు, బ్లూ జీన్స్ ఉన్నాయి. చేతిపై గౌరీ కే ఆదిలక్ష్మీ అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు. వివరాలు తెలిసిన వారు 9440796648 నెంబర్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న ఓంకార్



ఓంకార్‌కు స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వరస్వామిని టీవీ యాంకర్ ఓంకార్ ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా గణపతి పూజ చేసి అనంతరం క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్దనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను దర్శించుకుని ఆశీర్వాదం తీసుకున్నారు. స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు.

అడవిలో ఆధ్యాత్మిక శోభ

- గుబ్బల మంగమ్మ జాతరకు ఏర్పాట్లు
- ఈ నెల 14 నుంచి 16 వరకు జాతర



గుబ్బల మంగమ్మ గుడిని అలంకరించిన దృశ్యం



అలంకరణలో గుబ్బల మంగమ్మతల్లి



గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: అడవి తల్లి ఒడిలో కొలువుదీరిన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయం జాతరకు సిద్ధమవుతుంది. ఈ నెల 14 నుంచి 16వ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాల నిర్వాహణకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయ పరిసరాలు అందంగా తీర్చిదిద్దుతున్నారు. పచ్చని చెట్లు, ఎత్తయిన కొండలు, గలగల పారే సెలయేర్ల మధ్య ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి గుబ్బలు, గుబ్బలుగా ఉన్న గుహలో కొలువై ఉంది. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై భక్తుల పూజలందుకుంటోంది. గుబ్బల మంగమ్మ తల్లి దర్శనానికి దూరప్రాంతాల నుంచి అత్యధికంగా భక్తులు తరలి వస్తుంటారు.

గిరిపుత్రులే ఆలయ పూజారులు

ఆదివాసీ ఆరాధ్య దైవంగా కొలుస్తున్న గుబ్బల మంగమ్మ తల్లికి గిరిజన పూజారులే పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అమ్మ వారికి గిరిపుత్రులు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీ. మంగమ్మ తల్లి సన్నిధిలో అనేక మంది ఉపాధి పొందుతున్నారు. అడవిలో లభించే అటవీ ఉత్పత్తులు, రోకళ్లు, వెదురుతో అల్లిన చేటలు తదితర వస్తువులు విక్రయిస్తుంటారు.

ప్రయాణం ఆహ్లాద భరితం

మంగమ్మ తల్లి దర్శనానికి వెళ్లే మార్గలో ప్రయాణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. బుట్టాయగూడెం మండలం కామవరం దాటిన తర్వాత కొంత దూరం వెళ్లే సరికి దట్టమైన అడవి ఉంది. అక్కడ నుంచి కొద్ది దూరం తర్వాత గుబ్బల మంగమ్మ తల్లి దర్శనం కలుగుతుంది. ప్రయాణంలో ప్రకృతి రమణీయ దృశ్యాలు కనువిందు చేస్తాయి.

దర్శనానికి మార్గం ఇలా

గుబ్బల మంగమ్మ తల్లి గుడికి జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెం, దొరమామిడి, గాడిదబోరు, పందిరిమామిడిగూడెం మీదుగా వెళ్లొచ్చు. జంగారెడ్డిగూడెం నుంచి శ్రీనివాసపురం, పట్టిసపాలెం మీదుగా రామారావుపేట సెంటర్, అంతర్వేదిగూడెం, పందిరిమామిడి మీదుగా కూడా వెళ్లొచ్చు. తెలంగాణ నుంచి వచ్చే భక్తులు అశ్వారావుపేట నుంచి రాచన్నగూడెం, పూచికపాడు మీదుగా దర్శనానికి రావచ్చు. అశ్వారావుపేట నుంచి పూచికపాడు, రామచంద్రాపురం మీదుగా అటవీ మార్గంలో మంగమ్మ తల్లిని దర్శించుకోవచ్చు.

ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు



ఈ నెల 14 నుంచి 16 వరకు జాతర మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం. హోలి పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి ఆజ్ఞ మేరకు ఈ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం. పాలాభిషేకాలు, గణపతి విశేష సర్వయంత్ర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కోర్సా గంగరాజు, సర్పంచ్, కోర్సవారిగూడెం

గిరిజన సంప్రదాయంలోనే పూజలు



గిరిజన సంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమం నిర్వహిస్తాం. చీర, సారె కావిళ్ల అమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లిస్తాం. కార్యక్రమానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. గుజ్జా రామారావు, ఆలయ కమిటీ ప్రతినిధి, కామవరం

ఆటో బోల్తా పడి యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన నాని(ఫైల్)

ఆగిరిపల్లి: మండలంలోని అమ్మవారిగూడెం వద్ద ఆటో బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. ఆగిరిపల్లి చెందిన కూరపాటి నాని (31)ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఆగిరిపల్లి నుంచి బండారు గూడెంకు ఆటోలో గోనె సంచుల లోడుతో వెళ్తుండగా అమ్మవారిగూడెం వద్దకు రాగానే ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కనే గోతిలో బోల్తా పడింది. ప్రమాదంలో నాని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బధిర టీ 20 క్రికెట్ పోటీలకు ఎంపిక

భీమవరం(ప్రకాశంచౌక్): 7వ జాతీయస్థాయి బధిర టీ-20 క్రికెట్ పోటీలకు 16 మంది ఎంపికయ్యారని జిల్లా బధిర క్రికెట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రంగసాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ తాతారావు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికైన 16 మంది క్రీడాకారులు ఏప్రిల్ 19 నుంచి 25 వరకు హరియాణాలో జరిగే టీ-20 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆదివారం భీమవరం వెంకట్రామ థియేటర్‌లో జరిగిన సమావేశంలో వివరాలను తెలిపి ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు. ఇటీవల భీమవరం డీఎన్నార్ క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి టీ-20 క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారుల్లో 16 మంది జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని కోరుకుంటున్నామన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి ఆలయం



తూర్పురాజగోపుర ప్రాంతంలో భక్తుల రద్దీ



భక్తులతో నిండిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు దినం కావడంతో దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, కల్యాణకట్ట ఇలా అన్ని విభాగాలు భక్తులతో పోటెత్తాయి. స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించేందుకు అధిక సంఖ్యలో భక్తులు అన్నదాన భవనం వద్ద బారులు తీరారు. భక్తుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయాయి.

పెద్దింట్లమ్మా.. పాహిమాం



పెద్దింట్లమ్మకు పూజలు చేస్తున్న దాతలు



అనివేటి మండపం వద్ద కోలాటం

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. నీ చల్లని దీవెనలు అందించమ్మా అంటూ భక్తులు అమ్మను ఆర్తితో వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర ఆదివారానికి రెండో రోజుకు చేరింది. సెలవుదినం కావడంతో సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు జల్లు స్నానాలు ఆచరించారు. తలనీలాల సమర్పణ వద్ద రద్దీ కనిపించింది. అమ్మకు వేడి నైవేద్యాలను సమర్పించారు. ఉదయం జలదుర్గా సమేత పెద్దింటమ్మకు సుగంధ ద్రవ్యాభిషేకం, ధూప సేవ, బాలభోగం, పంచహారతులు అందించారు. పెద్దింట్లమ్మకు వస్త్ర, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదానికి భుజబలపట్నం గ్రామానికి చెందిన సయ్యపురాజు గుర్రాజు, బుద్దరాజు సుబ్రహ్మణ్యరాజు దాతలుగా వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మీగడ సత్యనారాయణ బృందం ప్రదర్శించిన మురళీ కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆదివారం ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, ఇతర సేవల వల్ల రూ.1,35,735 నగదు వచ్చినట్లు తెలిపారు. జలదుర్గాగోకర్ణేశ్వరస్వామి కల్యాణం ఈ నెల 10న జరుగుతుందని తెలిపారు.

కనుల పండువగా కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ



కోదండరాముడి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ఉండి: మండలంలోని చిలుకూరులో వేంచేసియున్న కోదండ రామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన కనులపండువగా నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయాన్ని పునఃనిర్మించారు. సర్పంచ్ ముదునూరి వెంకట సోమరాజు, ఆలయ ధర్మకర్త వేగేశ్న వెంకట రమణరాజు, ఆలయ నిర్మాణక మిటీ చైర్మన్ వేగేశ్న సత్యనారాయణ రాజు, దాతలు భీమరాజు, మాజీ సర్పంచ్ బంగార్రాజు, సీతారామరాజు తదితరులు ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని పూజ నిర్వహించారు. గ్రామంలోని భక్తులతో పాటుగా మహదేవపట్నం, వెలివర్రు, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, గరగపర్రు, భీమవరం తదితర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, మాజీ ఎమ్మెల్యే వెంకట శివరామరాజు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో పునఃప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు..

పెళ్లికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఐదుగురికి గాయాలు



సత్యనారాయణపురం గుండేరు వద్ద ప్రమాదానికి గురైన కారు









గాయపడ్డ బాధితులు →

దెందులూరు: పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్ద శనివారం అర్ధ రాత్రి దాటాక ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉంటున్న ఊట్ల రామకృష్ణ కుటుంబసభ్యులు సొంత కారులో పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో వివాహానికి వెళ్లారు. అనంతరం శనివారం రాత్రి రాజమహేంద్రవరం బయలు దేరారు. రాత్రి రెండు గంటల సమయంలో ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్దకు వచ్చేసరికి లారీని దాటేందుకు ప్రయత్నించగా, కారు అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న ఊట్ల రామకృష్ణకు తలపై, ఆయన భార్య అరుణకు కాలిపై గాయాలయ్యాయి. రామకృష్ణ నాన్నమ్మ అనంతలక్ష్మి, అరుణ అమ్మమ్మ సామ్రాజ్యం, కుటుంబసభ్యుడు ఇరుసుమల్లి మణికంఠ గాయపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న దెందులూరు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, హైవే పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఆశ్రం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివాజీ తెలిపారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

పట్టించుకోని అధికారులు



జీలుగుమిల్లి మండలం చీమలవారిగూడెం సమీపంలో టిప్పర్లలో మట్టి రవాణా

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం చీమలవారిగూడెం సమీపంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పట్టపగలు ఎలాంటి అనుమతి లేకుండా చింతలపూడి గట్టును ఆనుకుని ఉన్న ఆర్ అండ్ ఆర్ భూమిలో మట్టిని జేసీబీతో తవ్వి టిప్పర్లలో తోలుకుపోతున్నారు. కనీసం అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వెంచర్లు, లేఅవుట్, రియల్ ఎస్టేట్‌లకు అక్రమంగా మట్టిని తోలుకుపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత 5 రోజులుగా మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల సహకారంతోనే యథేచ్ఛగా మట్టి రవాణా జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా తరలుతున్న మట్టి రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



ఆర్ అండ్ ఆర్ భూమిలో మట్టిని జేసీబీతో తవ్వుతున్న దృశ్యం

వైభవంగా మరియ మాత ఉత్సవాలు



సందేశాన్ని అందిస్తున్న ఫాదర్ విజయ జోజిబాబు

కైకలూరు: మరియ మాత మహోత్సవాలు కలిదిండి విచారణ చర్చి వద్ద ఆదివారం రెండో రోజు ఘనంగా కొనసాగాయి. సమీప జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేశారు. కలిదిండి విచారణ కర్త బంటుమిల్లి యోహాను సమష్టి దివ్య పూజా బలి నిర్వహించారు. సాయంత్రం మేత్రాసన ఇంగ్లీషు మీడియం స్కూల్స్ కో-ఆర్డినేటర్ పల్లె విజయ జోజిబాబు ఏసు సందేశాన్ని అందించారు. కోరుకొల్లు విచారణకర్త గూడపాటి ప్రతాప్ ఆధ్వర్యంలో భక్తి పాటలు ఆలపించారు. అనంతరం కొవ్వూరుకు చెందిన హార్ట్ బీట్స్, క్రిస్టియన్ ఆర్కెస్ట్రా ఆలపించిన మధుర గీతాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

బైక్ పడి వ్యక్తి మృతి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రమాదవశాత్తూ బైక్ మీద పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం గునుపూడికి చెందిన వేలూరి సూర్యనారాయణమూర్తి బైక్ స్టార్ట్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ అతని తండ్రి సుబ్రహ్మణ్యంపై పడింది. సుబ్రహ్మణ్యం వెనుక తుంటికి గాయం కాగా భీమవరంలో ప్రైవేటు ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సుబ్రహ్మణ్యం మృతిచెందారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో చిన్నారి మృతి



చిన్నారి సృజన

పెదవేగి: పాముకాటుతో చిన్నారి మృతి చెందింది. పెదవేగి ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ..పెదవేగి మండలం న్యాయంపల్లికి చెందిన మద్దాల సురేష్ భార్య గర్భిణి కావడంతో పుట్టింటికి వెళ్లింది. తల్లితో పాటే కుమార్తె సృజన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. సృజన ఆదివారం ఉదయం అమ్మమ్మ ఇంటి దగ్గర ఆడుకుంటూ ఉండగా తాచుపాము చిన్నారిని కాటు వేసింది. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన చిన్నారిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ సృజన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రిటైర్డ్ జడ్జికి సత్కారం



రిటైర్డ్ జడ్జి గంగయ్యను సత్కరిస్తున్న దృశ్యం

ఉండి: రిటైర్డ్ జడ్జి పెరికల గంగయ్యను ఆదివారం వినియోగదారుల సంఘ నాయకుడు బొబ్బిలి బంగారయ్య, పలువురు భక్తులు సత్కరించారు. గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించడమే కాకుండా గుడి పోషణార్థం తనకున్న ఏడెకరాల భూమిని గుడికి దానం చేశారు. స్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని నాయకులు, పలువురు భక్తులు సన్మానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెడ్ మాస్టర్ వేణుగోపాల్ దంపతులు, త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కుక్కునూరు: కారు అదుపు తప్పి రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు పడ్డారు. శనివారం రాత్రి మండలంలోని కివ్వాక చెరువు కట్టపై ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కుక్కునూరు నుంచి కివ్వాక వైపు వెళ్తున్న కారు కివ్వాక చెరువు కట్ట మీదకు రాగానే రోడ్డు బాగోలేని కారణంగా అదుపు తప్పి పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. వారిలో ఒకరికి తీవ్రగాయాలు కావడంతో ఖమ్మం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

క్లుప్తంగా

ఘనంగా గోగులమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

అత్తిలి: స్థానిక గోగులమ్మపేటలో గోగులమ్మ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గోపూజ, వాస్తుపూజ, హోమం, జలాధి, క్షీరాధివాసాలు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు పాల్గొనాలని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

105 మందికి రక్తపరీక్షలు



రక్త పరీక్షల శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి నెలా నిర్వహించే ఉచిత షుగర్ రక్తపరీక్షల శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని లయన్ కొత్త సూర్య రమేష్ పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జనతా ట్రస్ట్ ఆవరణలో రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 105 మందికి వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీఏఎస్ లక్ష్మీనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ పుట్ట విజయశ్రీ, కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, వంగపండు రామ్మోహనరావు, పచ్చ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులకు సత్కారం



హోంగార్డులను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అత్యల్ప వేతనాలతో విలువైన సేవలను అందిస్తున్న హోంగార్డులు అభినందనీయులని ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమల్ల సూరిబాబు పేర్కొన్నారు. పట్టణంలో వాకర్స్ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో హోంగార్డులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రంధి సత్యనారాయణ, పెద్దోజు శ్రీనివాస్, వి.రాజు, ఏవీవీ రమణారావు, అమాలపురపు శ్రీను, కాకరపర్తి సతీష్ కుమార్ తదితరలును సత్కరించారు.

బీవీఆర్‌లో యాళ్లబండి తాతారావు సంస్మరణ సభ



యాళ్లబండి తాతారావు సంస్మరణ సభలో హరికథ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రముఖ హరికథా భాగవతార్ యాళ్ళబండి తాతారావు సంస్మరణ సభ నిర్వహించారు. బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో భక్త కుచేల హరికథ గానం ప్రముఖ భాగవతార్ నాయని లక్ష్మీ కుమారి గానం చేశారు. వైలన్‌పై వీరా ప్రసాద్, మృదంగంపై సరస్వతుల హనుమంతరావులు సహకరించారు. మనోరమ, దాసరి కాశీ విశ్వనాదం, డీవీఎస్ వర్మ, ఈపూరి సత్యనారాయణ, పావని నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

పేకాట శిబిరంపై దాడి

ఇరగవరం: మండలంలోని పెద్దిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై జానా సతీష్ తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి రూ.15,550 నగదు, నాలుగు మొబైల్స్, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ఇరగవరం విద్యార్థి

ఇరగవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.దుర్గామల్లేశ్వరరావు సెంట్రల్ జోన్స్ అథ్లెటిక్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు పాఠశాల హెచ్‌ఎం జి.నాగమణి తెలిపారు. పాలకోడేరు మండలం శృంగవృక్షంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానాలు సాధించినట్లు వివరించారు. ఇంతటి ఘనత సాధించిన విద్యార్థితోపాటు శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.సతీష్‌బాబు, కె.బాబూరావులను హెచ్‌ఎం నాగమణితోపాటు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

భయం గుప్పెట్లో పైడిపర్రు

- వరుస చోరీలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్న ప్రజలు
- కూడబెట్టిన సొత్తు దొంగలపాలై పోతుందని భయాందోళనలు
- పోలీసు నిఘాపై విమర్శలు



తణుకు రూరల్ పోలీస్ స్టేషన్

తణుకు అర్బన్: చీకటి పడుతుందంటే చాలు దొంగలు ఏవైపు నుంచి వస్తారు.. ఏ ఇళ్లు గుల్ల చేస్తారోనని.. పైడిపర్రు వాసులు భయం గుప్పెట్లో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇటీవలకాలంలో వరుస దొంగతనాలతో పైడిపర్రు ప్రాంతం అట్టుడుకుపోతోంది. ఇప్పటివరకు తాళం వేసి ఉన్న ఇళ్లే దోచు కునే పరిస్థితులు ఉండగా పైడిపర్రులో జరుగుతున్న దొంగతనాలు ఇంట్లో ఉండగానే ఇళ్లు గుల్లచేస్తుండడాన్ని ప్రజానీకం జీర్ణించుకోలేకపోతున్నారు. కష్టపడి సంపాదించుకున్న కొద్దిపాటి సొత్తు దొంగలపాలై పోతున్న తీరుతో ప్రజానీకం భయాందోళనలో బతుకుతున్నారు. గతనెల 28వ తేదీ తెల్లవారుజామున జరిగిన చోరీలో బాధితులు తాటికాయల వెంకటేశ్వరరావు, భార్య వీరవేణి చెప్పిన ప్రకారం ఏకంగా 39 కాసుల బంగారం, కిలో వెండి, రూ. 40వేలు నగదు చోరీ వ్యవహారం పైడిపర్రు వాసులకు షాకిచ్చింది. ఇంట్లో నిద్రిస్తుండగానే దర్జాగా బీరువా తెరచి దోచుకున్న దొంగల ధైర్యానికి పైడిపర్రు ప్రజలు కుదేలైపోయారు. గతనెల 17వ తేదీన 6 ఇళ్లలో దొంగలు స్వైరవిహారం చేసిన వ్యవహారం మరువక ముందే భారీ ఎత్తున చోరీ జరగడం పోలీసు నిఘా లోపం కనిపిస్తోందని ప్రజానీకం చర్చించుకుంటున్నారు. ఇందులో ఒక మహిళ మెడలో మూడు కాసుల బంగారు ఆభరణాలు దోచుకోగా, మరొక ఇంట్లో ద్విచక్రవాహనాన్ని దోచుకున్నారు. మరొక నాలుగు ఇళ్లలో తలుపులు, కిటికీలు, తాళాలు ధ్వంసం చేశారు. గతనెల 26వ తేదీన సైతం ఒక ఇంట్లోకి ప్రవేశించిన దొంగ ఏమీ దొరక్కపోవడంతో ఇంటి ముందున్న కారుపై కప్పిన ఖరీదైన బరకాన్ని దొంగిలించుకుపోయాడు. జరుగుతున్న చోరీలు స్థానికంగా ఉంటున్న నేరస్థుల పనే అయి ఉంటుందని ప్రజలు అనుమానిస్తున్నారు. ఇక ద్విచక్ర వాహనాల దొంగతనాలకు లెక్కలేకుండా పోయిందని బైక్ పోయిందని వెళ్తే కనీసం ఎఫ్ఐఆర్ కూడా వేయడంలేదంటూ బాధితులు వాపోతున్నారు. ఈ దొంగతనాలన్నీ రూరల్ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరగడం విశేషం. ఇలా వరుస ఘటనలు జరుగుతున్నా పోలీసులు తగు చర్యలు తీసుకోవడంలేదని, బీట్‌లు సరిగా నిర్వహించడంలేదని, అనుమానితులను అదుపులోనికి తీసుకోవడంలేదని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ సమీపంలోనే ఇలా జరుగుతుంటే ఇక మా పరిస్థితి ఏంటని తణుకు నియోజకవర్గ ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు.

పశువధ శాలకు ఇచ్చిన ప్రాధాన్యత పైడిపర్రుకు లేదా..?

తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు తణుకు రూరల్ పోలీసులు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని పైడిపర్రు వాసులు ఆరోపిస్తున్నారు. పశువధశాలకు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు ఆందోళన చేస్తున్న సమయంలో రాజకీయ ఒత్తిడి, ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలతో పోలీసులు పశువధ శాల ముందు పికెటింగ్ ఏర్పాటు చేసి రాత్రి పగలు సైతం పోలీసులు, రిజర్వ్ పోలీసులతో కాపలా కాశారని, గత 15 రోజులుగా పైడిపర్రులో దొంగలు స్వైరవిహారం చేస్తూ అందిన కాడికి దోచుకుపోతున్నా పోలీసులు పూర్తిస్థాయిలో నిఘా పెట్టడంలేదని ఆరోపిస్తున్నారు. పైడిపర్రులో వరుస చోరీలపై తణుకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్‌ను సాక్షి వివరణ కోరగా సీసీ ఫుటేజీల ద్వారా దొంగలను గుర్తిస్తున్నామని, అతి త్వరలోనే దొంగలను పట్టుకునే విధంగా పోలీసు బృందాలు పని చేస్తున్నాయని చెప్పారు. పైడిపర్రు, మండపాక గ్రామాల్లో రాత్రి సమయాల్లో ప్రత్యేక పోలీస్ బీట్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

దొంగలు విచ్చలవిడిగా తిరుగుతున్నారు



పైడిపర్రులో ఇటీవల జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు భయంతో కాలం గడుపుతున్నారు. కష్టపడి కూడబెట్టుకున్న సొత్తు ఏ దొంగ దోచుకుంటాడోనని బెంబేలెత్తిపోతున్నారు. అసలు పోలీసులు రాత్రి బీట్లు నిర్వహిస్తున్నారా అని అనుమానంగా ఉంది. దొంగతనాల్లో ద్విచక్ర వాహనాలపై వస్తూ వాహనాన్ని పార్కింగ్ చేసి అందిన కాడికి దోచుకుపోతున్నట్లుగా చూసినవాళ్లు చెబుతున్నారు. పోలీసులు ప్రజల్ని చైతన్యపరిచే విధంగా మైక్‌లో ప్రచారాలు నిర్వహించి సమావేశాలు నిర్వహించేలా కార్యాచరణ చేయాలి.

– యిందుగపల్లి బలరామకృష్ణ, మాజీ కౌన్సిలర్, పైడిపర్రు

పోలీసులు నిఘా పెంచాలి



పైడిపర్రులో జరుగుతున్న వరుస చోరీలను అరికట్టేందుకు పోలీసులు నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. తేతలిలోని పశువధ శాలకు స్థానిక ప్రజలు వ్యతిరేకంగా పోరాడుతున్న పరిస్థితుల్లో పోలీసులు సంస్థకు అనుకూలంగా పెట్టిన నిఘా కొంతైనా పైడిపర్రుపై పెట్టాలి. సంస్థలో పశువధ కార్యకలాపాలు నిర్వహించేందుకు రాత్రి, పగలు పశువధ శాల ముందు కాపలా కాసి మరీ పశువులను వధించేందుకు కృషి చేశారు. అదే పట్టుదలతో పైడిపర్రులో నిఘా పెడితే దొంగల భయం పోతుంది.

– జల్లూరి జగదీష్, గో సేవా సమితి సభ్యులు, తణుకు

భావనా రుషి స్వామికి ప్రత్యేక పూజలు

అత్తిలి: మంచిలి గ్రామంలో పద్మశాలి కులస్తుల కుల దైవం భావనా రుషి స్వామి వారి వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి మొములేటి ప్రసాద్, కోశాధికారి మోములేటి శ్రీనివాస్, బోదా నరసింహమూర్తి, వెలిదిండి సత్యనారాయణ, పెండెం రాంబాబు, బోసుకొండ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం 10 గంటల నుంచి టీటీడీ కల్యాణ మండపం (సత్యవతినగర్) ఆవరణలో నిర్వహిస్తున్నట్లు వాసవిక్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పసుమర్తి అనిల్, మండ బ్రహ్మాజీ, (వపన్), ముత్తా శ్రీధర్ గుప్తాలు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుల చేశారు విజయవాడ కామినేని ఆసుపత్రి, చైతన్య ఎమర్జెన్సీ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ వై.నిశ్చల్, డాక్టర్ బి.దివ్యశ్రీ, డాక్టర్ ఎల్.వర్ధన్, డాక్టర్ ఎ.నరేంద్రల పర్యవేక్షణలో న్యూరో, జనరల్ మెడిసిన్, కార్డియాలజిస్ట్, గుండె సంబంధిత వ్యాధులు, ఆయాసం, ఉబ్బసం, శ్వాసకోస వ్యాధులు, షుగర్, బీపీ, పక్షవాతం తదితర సమస్యలు ఉన్నవారికి పరీక్షలు, ఉచిత మందులు అందజేస్తారని తెలిపారు. 2డీ ఎకో, ఎలక్ట్రోథెరపీ, ఫిజియోథెరపీ, ఈసీజీ పరీక్షలు కూడా చేస్తారని పేర్కొన్నారు. రక్తపరీక్షలు కోసం ఉదయం పరగడపున రావాలని, శిబిరం వద్ద అల్పాహారం అందజేస్తామని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడిగా మారిశెట్టి



మారిశెట్టి శేషగిరిని అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు మారిశెట్టి శేషగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఆదివారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా శేషగిరి పేరును జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మారిశెట్టి శంకరం, పట్టణ మాజీ అధ్యక్షుడు మంగెన సూర్య బలపరచగా పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి కారుమూరి ఫోన్‌లో శేషగిరిని అభినందించారు. పట్టణంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణుల్లో అన్ని వర్గాల వారితో మమేకమై పని చేయాలని సూచించారు. పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన మారిశెట్టి శేషగిరి మాట్లాడుతూ మాజీమంత్రి కారుమూరి ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా తనకు అవకాశం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నానని, తనపై ఉంచిన బాధ్యతను పూర్తి స్థాయిలో నిలబెట్టుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో లీగల్‌సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, ఎంపీపీ రుద్రా ధనరాజు, తణుకు మండల అధ్యక్షుడు పెనుమర్తి వెంకటరామన్న, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, వడ్లూరి సీతారాం, ఉండవల్లి జానకి, కొత్తపల్లి చరణ్, ఫణీంద్రకుమార్ వీరమల్లు, ఝాన్సీ లారెన్స్, చింతలపూడి సూర్యనారాయణ, చంద్రశేఖర్, బుడితి సుజన్‌కుమార్, కంకటాల సతీష్, చింతాడ సంజీవరావు, కొమ్మోజు రామకృష్ణ, కర్రి గంగాధర అప్పారావు, వై.రామకృష్ణ, షేక్ జిలాని, రంభ నాగేశ్వరరావు, రేలంగి రాంబాబు, గారపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

చికెన్, కోడి గుడ్డుపై అపోహలొద్దు



చికెన్, కోడి గుడ్లను తింటున్న జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ శంకర్, రైతులు

తణుకు అర్బన్: కోళ్లలో ఎటువంటి వైరస్ లేదని నిస్సందేహంగా చికెన్, కోడి గుడ్లు ఆహారంగా తీసుకోవచ్చని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. వేల్పూరు ఎన్టీఆర్ పార్కులో ఆదివారం పౌల్ట్రీ ఫెడరేషన్ వేల్పూరు జోన్ రైతులు నిర్వహించిన చికెన్ మేళాలో ఆయన మాట్లాడారు. చికెన్, కోడి గుడ్లను ఉడికించి వండుకుని తినడం వలన ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. వేల్పూరులో రెడ్‌జోన్ మినహా ఎక్కడా కూడా చికెన్, కోడి గుడ్ల అమ్మకాలపై ఎటువంటి ఆంక్షలు లేవని నిరభ్యంతరగా ఆహారంగా తీసుకోవచ్చని సూచించారు. ఈ విషయాన్ని ఇటీవల జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి ప్రకటించారని గుర్తు చేశారు. వైరస్ కారణంగా పౌల్ట్రీ రంగాన్ని తీవ్రంగా కుదిపేసిందని చికెన్, కోడి గుడ్లు అనుసంధానంగా నడిచే వ్యాపారాలు ఇబ్బందుల్లో పడ్డాయన్నారు. ఈ సందర్భంగా చికెన్ వంటకాలతో పాటు కోడి గుడ్లను పశు సంవర్థకశాఖ అధికారులు, రైతులు తిన్నారు. అనంతరం చికెన్ మేళాకు హాజరైన ప్రజలకు చికెన్ వంటకాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో తణుకు మండల పశు సంవర్థక శాఖ వైద్యాధికారి డాక్టర్ శంకర్ భావన్నారాయణ, పౌల్ట్రీ రైతులు పెనుమర్తి మోహన్, జీవీఆర్ చౌదరి, పి.రంగారావు, పి.సారథి, ఎన్.కిషోర్, ముల్లంగి మాధవరావు, యు.చిరంజీవి, ఎన్.సుబ్బారావు, బోడపాటి ఆనంద్‌బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై రైతుల నిరసన



బీటలు వారిన పంట చేల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

అత్తిలి: ఈడూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఆవదొడ్డి ఆయకట్టు ప్రాంతానికి దాళ్వా పంటకు సాగునీరు అందక వరి చేలు బీటలు వారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఆ ప్రాంత రైతులు చేలల్లో దిగి నెరలు తీసిన చేలల్లో దుబ్బులు తీసి సాగునీరు అందించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదల కారణంగా రెండు పర్యాయాలు సార్వా పంట పూర్తిగా పాడై నష్టం వాటిల్లిందన్నారు. మూడో దఫా పంట ఊడ్చ లేక 400 ఎకరాలు వదిలేశామని, నష్టపోయిన రైతులకు ఎటువంటి పరిహారం ప్రభుత్వం అందించలేదని వాపోయారు. ప్రస్తుత దాళ్వా సాగులో ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెట్టామని, తీరా పంట ఈనిక దశకు వచ్చే సరికి సాగునీరు అందక వరి చేలు బీటలు వారుతున్నాయని, దీంతో పంట దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి కౌలు వ్యవసాయం చేస్తున్నామని, సాగునీరు సరఫరా సక్రమంగా లేకపోవడంతో దాళ్వా సాగులో దిగుబడులు తగ్గి నష్టపోయే పరిస్థితి నెలకొందని వాపోయారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణమే తమ ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్, రైతులు సంకు లక్ష్మణరావు, బొక్కా యాకోబు, వానపల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదియోగి పంచక్షేత్ర దర్శిని బస్సులను వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదియోగి పంచక్షేత్ర దర్శిని బస్సులను ప్రయాణికులు, భక్తులు, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ద్వారపూడి సమీపంలోని 60 అడుగుల ఎత్తులో నిర్మించిన ఆదియోగి విగ్రహ దర్శనం, ద్వారపూడి అయ్యప్ప స్వామి ఆలయ దర్శనం, బిక్కవోలులో శ్రీ లక్ష్మీగణపతి స్వామి దర్శనం, పంచారామక్షేత్రం ద్రాక్షారామం శ్రీ భీమేశ్వరస్వామి ఆలయం, ఏడువారాల వాడపల్లి వెంకన్న దర్శనాలు జరుగుతాయని చెప్పారు. బస్సు ప్రతి ఆదివారం ఉదయం 5 గంటలకు డిపో నుంచి బయలుదేరి సాయంత్రం డిపోకు చేరుతుందని, టిక్కెట్ ధర రూ.350గా నిర్ణయించామన్నారు, 50 మంది భక్తులు కోరితే ఏ రోజైనా బస్సును నడుపుతామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99592 25488, 73829 05856, 99597 53102, 99855 44411 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ తీరును ప్రజలకు వివరించాలి



ఎల్.అగ్రహారంలో సమావేశమైన వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తుందని, ఆ విషయాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ సూచించారు. ఆదివారం మండలంలోని ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, గొల్లగూడెం, అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో పార్టీ గ్రామ, అనుబంధ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయడానికి గ్రామ కమిటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మండల కమిటీ సభ్యులు తమ్మిశెట్టి రఘు, వెలిశెట్టి నరేంద్రకుమార్, చేబోయిన కృష్ణ, గుడ్ల నాగరాజు, సాదే ప్రసాద్, శీలి మాతయ్య, కామన గణపతి, కామన శ్రీను, అయినపర్తి శ్రీను, తారమట్ల శ్రీనివాస్, నీలపాల రామన్న, కొత్తపల్లి ప్రసాద్, ముద్రగడ లలిత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగాసన పోటీలకు చంద్రశేఖర్ ఎంపిక



బడుగు చంద్రశేఖర్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బడు గు చంద్రశేఖర్ ఆలిండియా సివిల్ సర్వీసెస్ యోగా చాంపియన్ షిప్ జాతీయ స్థాయి యోగాసన పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు చండీఘడ్‌లో ఈ నెల 5,6,7,8వ తేదిల్లో జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ తరపున చంద్రశేఖర్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయనను దండగర్ర సర్పంచ్ పిల్లా రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చంద్రశేఖర్ అభినందించారు.

అరకొర మరమ్మతులపై ఆగ్రహం

- అప్పుడే గుంతలు ఏర్పడిన దుస్థితి
- నాణ్యత లేకపోవడంతో నెల రోజుల్లోనే శిథిలమవుతున్న ప్యాచ్‌వర్కు పనులు
- రూ. 10 లక్షల నిధులతో పనులు



రైల్వే స్టేషన్ రోడ్డులో ఇటీవల వేసిన మెటల్ ప్యాచ్ వర్కు దుస్థితి

తణుకు అర్బన్: తణుకు మునిసిపాలిటీ పరిధిలో ఇటీవల చేసిన ప్యాచ్‌వర్కు పనుల్లో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గత నెలాఖరులో తణుకు రాష్ట్రపతి రోడ్డు, ఆర్వోబీ, రైల్వే స్టేషన్ రోడ్డు, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డుల్లో సుమారుగా రూ. 10 లక్షల నిధులతో ప్యాచ్‌వర్కు పనులు చేపట్టారు. అయితే సదరు ప్యాచ్ వర్కు పనుల్లో డొల్లతనం కారణంగా ప్యాచ్‌వర్కు చేయకముందే రహదారులు బాగున్నాయని ప్యాచ్‌వర్కు చేసిన ప్రాంతంపై ప్రయాణిస్తుంటే ఒళ్లంతా కదిలిపోతుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆర్వోబీపై చేసిన ప్యాచ్ వర్కు పనులు కాంట్రాక్టరుకు లబ్ధి చేకూరేలా కొలతల కోసమేనా అనే విధంగా వేశారని పలువురు ఆరోపిస్తున్నారు.

తారు తక్కువ.. మెటల్ ఎక్కువ

ముఖ్యంగా తారురోడ్డు ప్యాచ్‌వర్కు పనుల్లో నాణ్యత లోపం తీవ్రంగా కనిపిస్తోంది. ప్యాచ్‌వర్కు చేసిన ప్రాంతంలో మెటల్ ఎక్కువ వేసి తారు తక్కువ వేశారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. తారు ధర అధికంగా ఉండడంతో చాలా పొదుపుగా వాడారని మెటల్ అధికంగా వేయడంతో నెల రోజుల వ్యవధిలోనే మళ్లీ గుంతలు కనిపిస్తున్నాయ ని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్యాచ్‌వర్కులు సైతం గుంతలు మాదిరిగా వేయడం, రోలర్‌తో సరిగా రోలింగ్ చేయించకపోవడంతో ప్యాచ్‌వర్కు పనులు అరకొరగా కనిపిస్తున్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డులో స్టేషన్ ప్రాంతంలో ఇటీవల మెటల్ మిక్సింగ్‌తో వేసిన రోడ్డు భాగం రాళ్లు లేచిపోయి ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల వేగానికి రోడ్డుపై రాళ్లు లేచిపోయి దుకాణాల్లోకి వస్తుండడంతో గాయాలవుతాయోనని వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. పనుల్లో నాణ్యత లేకపోయినా అధికారులు పట్టించుకోలేకపోతున్నారా, కాంట్రాక్టరుకు ఖర్చులు పెరగడంతో ఇలా నాణ్యతకు తిలోదకాలు పలుకుతున్నారో తేలాల్సి ఉంది. వచ్చే వర్షాకాలంలో ఈ ప్యాచ్‌వర్కు పనులన్నీ తిరిగి గుంతలుగా మారడం ఖాయమని ప్రజలు జోస్యం చెబుతున్నారు.



రాష్ట్రపతి రోడ్డులో ఇటీవల వేసిన తారు ప్యాచ్ వర్కులో గుంతలు ఏర్పడిన దృశ్యం



ఆర్వోబీపై ఇటీవల వేసి ప్యాచ్ వర్కు పనుల్లోతారు లేక రాళ్లు బయటపడ్డ వైనం

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్‌లో ఆదివారం సాయంత్రం త్యాగరాజ స్వామి వారి 84వ ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. త్యాగరాజు గాన సభ అధ్యక్ష, కార్యదర్శులు గరికిపాటి బాపయ్య శర్మ, సరస్వతుల హనుమంతరావు పర్యవేక్షణలో ఉదయం త్యాగరాయ కృతులు ఆలపించారు. సాయంత్రం సర్వేపల్లి సిస్టర్స్ డాక్టర్ శ్రేయ, డాక్టర్ రాజ్యలక్ష్మి గార్ల గాత్ర కచేరి నిర్వహించారు. వైలన్‌పై సరస్వతుల పార్థివ్, మృదంగంపై పెరవలి జయభాస్కర్, ఘటంపై సరస్వతుల హనుమంతురావు పలు కృతలు ఆలపించారు, ఆరాధానోత్సవాలు ఈ నెల 6 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళా కేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు, రమణ, గాంధీ పాల్గొన్నారు.